
సాక్షి
మహబూబ్‌నగర్

గురువారం । 21 । డిసెంబర్ । 2023



కేఎస్పీ నీటి విడుదల ఖరారు

జనవరి 6 నుంచి కోయిల్‌సాగర్ నీటిని విడుదల చేయనున్నారు.

వివరాలు 8లో ▸



నాగలదిన్నె వంతెన ప్రారంభం

తుంగభద్ర నదిపై నిర్మించిన నాగలదిన్నె వంతెనను బుధవారం ప్రారంభించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /177

వాతావరణం

ఉదయం, రాత్రి చలి తీవ్రత అధికంగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి



పాలమూరు: సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి హక్కులు పరిరక్షించాలని, హక్కులకు భంగం కలగకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే న్యాయ సేవా అధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. చదువుపై దృష్టి పెట్టి భవిష్యత్‌లో మంచి రంగాల్లో రాణించాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ పుట్టపాగ రఘుపతి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, న్యాయవాదులు సతీష్, యోగేశ్వర్ రాజ్‌యాదవ్, మల్లారెడ్డి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నాగరాజు పాల్గొన్నారు.

చదువుకుంటేనే భవిష్యత్: డీఈఓ



అడ్డాకుల: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని జిల్లా విద్యాధికారి రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షల వరకు కష్టపడి చదవాలని చెప్పారు. ఫిబ్రవరిలో మరోసారి ప్రేరణ తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. ప్రతి విద్యార్థి లో సామర్థ్యం ఉంటుందని, దాన్ని వెలికి తీయ డమే మన కర్తవ్యంగా భావించాలని సూచించారు. ర్యాంకుల కోసం కాకుండా విషయ పరిజ్ఞానం కోసం చదవాలని చెప్పారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు మెళకువలను బోధించారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకు డు శ్రీనివాస్, సీఎంఓ బాలు యాదవ్, మండల నోడల్ అధికారి వి.కురుమూర్తి, హెచ్‌ఎంలు జ్యోతి, ప్రకాష్, ఫయాజోద్దీన్ పాల్గొన్నారు.

లెక్క లేదా..!

జిల్లాలో సర్కారు భూములపై గందరగోళం



■ **హన్వాడ మండలం చిన్నదర్పల్లి గ్రామశివారులోని సర్వే నంబర్ 186లో** మొత్తం 13.13 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భూమి ఉంది. ఈ మేరకు ఆ భూమి ప్రభుత్వానిది అని.. దీన్ని ఎవరు తొలగించినా శిక్షార్హులవుతారని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పాతారు. అయినా కొంత భూమి కబ్జాకు గురైంది.

■ నవాబుపేట మండలం ఇప్పటూర్ గ్రామ శివారు సర్వే నంబర్ 156లో ప్రభుత్వం నాలుగు దశాబ్దాల క్రితం శ్మశానవాటికకు భూమి కేటాయించింది. ఇందులో సమాధులు ఉన్నాయి. పక్క భూమికి సంబంధించిన వ్యక్తి శ్మశానవాటిక భూమిలోకి వచ్చి చదును చేస్తున్నారు. ఈ మేరకు ఆ గ్రామానికి చెందిన దళితులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

... ఇవి ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించి కొన్ని ఉదాహరణలు మాత్రమే. సర్కారు స్థలాలను పరిరక్షించాల్సిన రెవెన్యూ యంత్రాంగానికి ఇవేమీ పట్టవు. నోటీసులిచ్చాం.. విచారణ చేస్తాం.. తమ పరిధి కాదని తప్పించుకోవడం ఆ శాఖకు అలవాటుగా మారింది. అయితే ప్రజా, ప్రభుత్వ అవసరాలకు సర్కారు భూముల కేటాయింపులపైనా స్పష్టత లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

- పలు తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డులు మాయం?
- కొన్ని చోట్ల రికార్డుల నిర్వహణను మరిచిన యంత్రాంగం
- ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన కలెక్టర్ రవినాయక్
- వారంలో నివేదిక ఇవ్వాలని రెవెన్యూ శాఖకు ఆదేశాలు
- గడువు ముగిసినా స్పందించని పలువురు తహసీల్దార్లు
- అధికారులు, సిబ్బంది తీరుపై అనుమానాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లాల వారీగా సర్కారు భూముల లెక్క తేల్చాలని కలెక్టర్లను ఆదేశించింది. ఈ మేరకు మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ సర్కారు స్థలాలకు సంబంధించి వారంలో పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. నిర్దిష్ట గడువు ముగిసినప్పటికీ ఇప్పటివరకు ఏ ఒక్క మండలం నుంచి సరైన వివరాలు అందనట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలో రెవెన్యూ శాఖపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు తహసీల్దార్ కార్యాలయాల్లో భూ రికార్డులు మాయం కాగా.. కొన్ని మండలాల్లో తహసీల్ సిబ్బంది రికార్డుల నిర్వహణను మరిచి ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

2014కు ముందు.. ఆ తర్వాత..

వారం రోజుల క్రితం కలెక్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కలిసి ప్రభుత్వ భూముల వివరాలపై నివేదిక ఇవ్వాలని కోరిన విషయం విదితమే. 2014 సంవత్సరానికి ముందు, ఆ తర్వాత ప్రభుత్వ భూముల వివరాలను విడివిడిగా పేర్కొంటూ పూర్తిస్థాయిలో రిపోర్టులు సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని మండలాల తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. 2014కు ముందు ఎక్కడెక్కడ ప్రభుత్వ భూమి ఉంది.. 2014 నుంచి ఇప్పటివరకు ప్రజలు, ప్రభుత్వ అవసరాల మేరకు కట్టబెట్టిన విధానం, కేటాయింపులకు సంబంధించి సమగ్ర నివేదిక అందజేయాలని సూచించారు. దీంతో ఆయా మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది వారానికి పైగా ఆ పనిలోనే తలమునకలయ్యారు.

మరో రెండురోజుల్లో నివేదికలు



ప్రభుత్వ భూముల వివరాలపై అన్ని మండలాల్లో కసరత్తు జరుగుతుంది. అసైన్‌మెంటు, వివిధ ప్రభుత్వ శాఖలకు వారి అవసరాల నిమిత్తం కేటాయించిన ప్రభుత్వ భూముల వివరాలు, మిగులు భూమి ఎంత అనే దానిపై స్కెచ్‌తో సహా మండలాల వారీగా రిపోర్టులు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. మరో రెండు రోజుల్లో ప్రభుత్వ భూముల వివరాలపై క్లారిటీ వచ్చే అవకాశముంది.

– అనిల్‌కుమార్, ఆర్డీఓ

అంతా అడ్డగోలు.. అధికారుల్లో గుబులు

కలెక్టర్ ఆదేశాలతో నివేదికల తయారులో నిమగ్నమైన రెవెన్యూ అధికారులు తలపట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ భూముల కేటాయింపుల్లో చోటుచేసుకున్న అక్రమాలు, రికార్డుల్లో భూమి ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో లేకపోవడం, రికార్డుల్లో నమోదు చేయకపోవడం, కొన్ని చోట్ల అడ్డగోలుగా భూములను కట్టబెట్టడం, నిబంధనల ప్రకారం కేటాయింపులు చేసినా.. వాటికి సంబంధించి రికార్డుల్లో మార్పులు చేయకపోవడం వంటివి రెవెన్యూ అధికారులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ భూములను వివిధ అవసరాలకు కట్టబెట్టిన విధానం, కేటాయింపులు జరిగిన తీరుపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆరా తీస్తుండడంతో అవినీతికి పాల్పడిన పలువురు అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నట్లు సమాచారం.

ధరణి ప్రక్షాళనతో పాటు..

గతంలో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన, నూతన పట్టాదారు పాస్ పుస్తకాల జారీ, తహసీల్దార్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు, వెంటనే మ్యుటేషన్లు, ధరణి పోర్టల్‌లో భూవివరాలను అందుబాటులోకి తీసుకురావడం వంటి మార్పులను రెవెన్యూ శాఖ తీసుకొచ్చింది. ఈ చర్యలు పూర్తి స్థాయి ఫలితాలు సాధించకపోగా.. మరింతగా సమస్యలు ఎక్కువ కావడంతో తాజాగా ఏర్పడిన ప్రభుత్వం ధరణి పోర్టల్, భూవివరాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ధరణిని ప్రక్షాళన చేయాలనే ఆలోచనతో పాటు ప్రభుత్వ భూముల వివరాలపై ఆరా తీస్తోంది. త్వరలో జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించే సమావేశంలో ఈ అంశాలపైనే చర్చ జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

అంతా గప్‌చుప్..

ప్రభుత్వ భూముల వివరాలు సమర్పించారా? ప్రభుత్వ, ప్రజా అవసరాలకు ఎక్కడెక్కడ కేటాయింపులు చేశారు? మండలాల వారీగా వివరాలు అందాయా? అని ప్రశ్నిస్తే తహసీల్దార్ నుంచి జిల్లాస్థాయి అధికారి ఏ ఒక్కరు కూడా స్పందించలేదు. ఏమని చెబితే ఏమవుతుందోననే భయం వారిలో నెలకొంది.



చిన్నదర్పల్లి శివారులోని సర్వే నంబర్ 186లో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ప్రాధాన్యత రంగానికి ఎక్కువ రుణాలివ్వాలి



2024–25 వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ రవినాయక్, ఇతర అధికారులు

- బ్యాంకులు ఆర్థిక అవగాహన శిబిరాలు నిర్వహించాలి: కలెక్టర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రాధాన్యత రంగాలకు ఎక్కువ రుణాలు అందించేలా బ్యాంకర్లు దృష్టి పెట్టాలని కలెక్టర్ జి.రవినాయక్ సూచించారు. బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు వడ్డీ వ్యాపారులు, ఇతరుల దగ్గర రుణాలు తీసుకొని మోసపోకుండా బ్యాంకులు ఆర్థిక అవగాహన శిబిరాలను నిర్వహించాలని, అన్ని బ్యాంకుల బ్రాంచీలు జిల్లాలో గ్రామానికి ఒక శిబిరం చొప్పున నిర్వహించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్ ప్రాంతాలలో సైతం మెగా ఆర్థిక అక్షరాస్యత శిబిరాలను నిర్వహించాలన్నారు.

■ 2023–24 సంవత్సర వార్షిక రుణ ప్రణాళిక అమలులో భాగంగా గత సెప్టెంబర్ చివరి నాటికి సాధించిన లక్ష్యాలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత రంగాలకు రుణాలు ఇవ్వడంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాల్సిందిగా కోరారు. 2023–24 వార్షిక రుణ ప్రణాళికలో వ్యవసాయ పంట రుణాల కింద రూ.3162.45 కోట్ల రుణాల లక్ష్యానికి రూ.1453.82 కోట్ల రుణాలు ఇచ్చారని చెప్పారు. వ్యవసాయ కాలపరిమితి రుణాల కింద రూ.601.64 కోట్లలకు రూ.638.17 కోట్ల రుణాలు ఇచ్చి 106.7శాతం లక్ష్యాలను సాధించారని వివరించారు. మొత్తం వ్యవసాయ రంగానికి రూ.4,333.58 కోట్ల రుణాలు ఇవ్వాలని గత వార్షిక రుణ ప్రణాళికలో లక్ష్యంగా నిర్ణయించగా, సెప్టెంబర్ వరకు రూ.2,224.86 కోట్లు ఇచ్చి 51.34 శాతం లక్ష్యాన్ని సాధించారని తెలిపారు.

■ ప్రాధాన్యత రంగంలో రూ.5,143.27 కోట్లకు రూ.2,775.29 కోట్లు ఇచ్చారని, ప్రాధాన్యేతర రంగం కింద రూ.344 కోట్లకు రూ.928 కోట్లు ఇచ్చి.. 269శాతం సాధించామని తెలిపారు. 2023–24 వార్షిక రుణ ప్రణాళికలో మొత్తం రూ.5488.25 కోట్లకు రూ.3,703.7కోట్ల రుణాలిచ్చి 67.48శాతం లక్ష్యాన్ని సాధించినట్లు వివరించారు.

■ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కింద ఐదేళ్లలో ఇచ్చిన రుణాలు, పొందిన తర్వాత వారి జీవన విధానంలో వచ్చిన మార్పులపై డేటా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్‌బీఐఆర్‌సెటీ ద్వారా ఈ సంవత్సరం 422 మందికి శిక్షణ ఇవ్వగా, 75 మంది బ్యాంకు అనుసంధానంతో రుణాలు తీసుకున్నారని అధికారులు చెప్పగా.. మిగిలిన వారు రుణాలు తీసుకోకపోవడానికి గల కారణాలను నివేదించాలని సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో 15,905 మంది వీధి వ్యాపారులకు రుణాలివ్వాలని గుర్తించగా, 8వేల మందికి రుణాలు ఇచ్చారని, అలాగే రెండో విడతలో గుర్తించి 9,826లో కేవలం 1,028 మందికే రుణాలివ్వడానికి గల కారణాలు సమర్పించాలని సూచించారు. బ్యాంకుల ద్వారా వివిధ సెక్టార్ల కింద రుణాలు పొందిన వారు వాటిని తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, నాబార్డ్ డీడీఎం షణ్ముఖ శర్మ, ఆర్బీఐ ఎల్బీఓ దేవజిత్ బారువా, లీడ్ బ్యాంక్ మేనేజర్ కాల్వ భాస్కర్ పాల్గొన్నారు.

నాబార్డ్ ఆర్థిక అంచనా రూ.6,203.5 కోట్లు

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాబార్డ్ ద్వారా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ కింద రూ.6203.5 కోట్ల ఆర్థిక అంచనా కరదీపికను కలెక్టర్ రవినాయక్ విడుదల చేశారు. నాబార్డ్ జిల్లాలో అందుబాటులో ఉన్న భౌతిక, ఆర్థిక సామర్థ్యాన్ని అంచనా వేస్తుందని తెలిపారు. దీన్ని ఆధారంగా చేసుకొని జిల్లాలో లీడ్ బ్యాంకు వివిధ బ్యాంకుల ద్వారా అమలు చేయడానికి వార్షిక జిల్లా క్రెడిట్ ప్లాన్‌ను సిద్ధం చేస్తుందన్నారు. దీని ప్రకారంపంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ కోసం రూ.3,343.41 కోట్లు, వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల కోసం టర్మ్ లోన్ రూ.1,001.26 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాల కోసం రూ.86.87 కోట్లు, అనుబంధ కార్యకలాపాల కోసం రూ.497.85 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) కోసం రూ.1,129.95 కోట్లతో జిల్లాకు మొత్తం ప్రాధాన్యత రంగానికి రూ.6,203.50 కోట్లుగా నాబార్డు ఆర్థిక అంచనా వేసినట్లు తెలిపారు.


11 మంది డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాలో పనిచేస్తున్న 11 మంది డిప్యూటీ తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

డిప్యూటీ తహసీల్దార్	ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
అస్గర్‌ఖాన్	డీఎంసీఎస్, మహబూబ్‌నగర్	ఎస్‌డీసీ యూనిట్-2
ఎం.స్వప్న	డీసీఎస్‌ఓ ఆఫీస్, మహబూబ్‌నగర్	తహసీల్దార్ ఆఫీస్, బాలానగర్
విష్ణుప్రియ	డీసీఎస్‌ఓ ఆఫీస్, మహబూబ్‌నగర్	ఆర్డీఓ ఆఫీస్, మహబూబ్‌నగర్
సి.వెంకటేశ్వర్‌రావు	ఆర్డీఓ ఆఫీస్, మహబూబ్‌నగర్	డీఎస్ఎస్‌ఓ, మహబూబ్‌నగర్
ఇంతియాజుద్దీన్	తహసీల్దార్ ఆఫీస్, గండేడ్	డీఎంసీఎస్, మహబూబ్‌నగర్
ఎం.భారతి	ఎస్‌డీసీయూనిట్-2, మహబూబ్‌నగర్	డీసీఎస్‌ఓ మహబూబ్‌నగర్
బి.బాలాప్రసాద్	డీసీఎస్‌ఓ ఆఫీస్, మహబూబ్‌నగర్	ఎస్‌డీసీ యూనిట్-2
కె.దేవేందర్	తహసీల్దార్ ఆఫీస్, బాలానగర్	తహసీల్దార్ ఆఫీస్, నవాబ్‌పేట
హెచ్.రాజగోపాల్	తహసీల్దార్ ఆఫీస్, మ.నగర్ అర్బన్	తహసీల్దార్ ఆఫీస్ గండేడ్
లిఖిత	తహసీల్దార్ ఆఫీస్,నవాబ్‌పేట	డీసీఎస్‌ఓ మహబూబ్‌నగర్
వరప్రసాద్	ఎస్‌డీసీ యూనిట్-2 మహబూబ్‌నగర్	తహసీల్దార్ ఆఫీస్, మ.నగర్ అర్బన్

ఆర్టీపీసీఆర్ పరీక్షలు ప్రారంభం

- జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేకంగా పది పడకల వార్డు ఏర్పాటు
- త్వరలో పీహెచ్‌సీ స్థాయిలో అనుమానితులకు పరీక్షలకు ఏర్పాట్లు
- కేరళ వెళ్లే అయ్యప్పభక్తులు జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యాధికారులు



పాలమూరు: ఇతర రాష్ట్రాల్లో కోవిడ్ కొత్త వేరియంట్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారులతో పాటు కరోనా చికిత్స అందించే ప్రభుత్వ ఆస్పత్రి అధికారులను అప్రమత్తం చేశారు. ఆరోగ్యశాఖ అధికారులతో పాటు జనరల్ ఆస్పత్రి వైద్య అధికారులు ముందస్తుగా సన్నద్ధం అవుతున్నారు. బుధవారం నుంచి జిల్లా జనరల్ ఆస్పత్రిలో అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు ప్రారంభించారు. మొదటి రోజు 15మంది అనుమానితుల నుంచి శాంపిల్స్ సేకరించారు. ముందస్తుగా ఆస్పత్రి అధికారులు కోవిడ్ భవనంలో ప్రత్యేకంగా పది పడకలకు వెంటిలేటర్, ఆక్సిజన్ ఇతర సదుపాయాలు సిద్ధం చేశారు. ఆర్టీపీసీఆర్ చేసుకున్న అనుమానితుల్లో ఎవరికైనా పాజిటివ్ వస్తే ఈ ప్రత్యేక వార్డులో చికిత్స అందించే విధంగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో కూడా త్వరలో ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేస్తామని వైద్యారోగ్యశాఖ అధికారులు వెల్లడించారు.

ప్రమాదకరం కాదు..

కోవిడ్‌లో వచ్చిన కొత్త రకం వైరస్ తీవ్ర ప్రమాదకరమైనది కాదు. జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. జనరల్ ఆస్పత్రిలో కావాల్సిన పడకలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరం అయిన డ్రగ్స్ కూడా అందుబాటులో ఉంచాం. ఆర్టీపీసీఆర్ పరీక్షలు కూడా ప్రారంభించాం. ప్రతి రోజు అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహిస్తాం. వాతావరణ మార్పుల కారణంగా కూడా చాలా మందిలో జ్వరం, దగ్గు, జలుబు ఇతర సమస్యలు ఉంటున్నాయి. చలికాలంలో వేడినీళ్లు తాగడం, తాజా ఆహారం తీసుకోవడం, రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉండాలి. జనాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్తే తప్పక మాస్క్ ధరించాలి.

– డాక్టర్ జీవన్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

జాగ్రత్తలు తీసుకోవాలి..

ప్రస్తుతం వస్తున్న కరోనా తీవ్రత కేరళలో అధికంగా ఉన్న క్రమంలో అయ్యప్ప భక్తులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. శబరి వెళ్లే స్వాములతో పాటు భక్తులు కూడా మాస్కులు ధరించడం, శానిటేషన్ చూసుకోవడం చేయాలి. అక్కడి నుంచి జిల్లాకు వచ్చిన తర్వాత కూడా జ్వరం, దగ్గు, జలుబు ఇతర లక్షణాలు ఏమైనా ఉంటే వైద్యుడి సలహాతో మందులు వాడాలి. అవసరమైతే ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేసుకోవాలి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశంపై స్పష్టమైన ఆదేశాలు రాలేదు.

– డాక్టర్ కృష్ణ, డీఎంహెచ్‌ఓ

సీనియర్ అసిస్టెంట్, ఆర్‌ఐలకు కౌన్సెలింగ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రెవెన్యూ శాఖలో పని చేస్తూ రెండు సంవత్సరాల సర్వీసును పూర్తి చేసుకున్న జిల్లాలోని సీనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు బుధవారం కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలోని ఆయా మండలాల్లో పని చేస్తున్న 15 మంది ఆర్‌ఐలుగా వెళ్లేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇందులో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లుగానే ఉంటామని పేర్కొన్నట్లు సమాచారం. కౌన్సెలింగ్‌లో పాల్గొన్న 15 మంది రెవెన్యూ ఉద్యోగుల పూర్తి వివరాల సేకరణతో పాటు బదిలీలకు సంబంధించిన కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. కాగా కలెక్టర్ జి.రవినాయక్ అనుమతి కోసం అధికారులు నివేదికను పంపినట్లు తెలిసింది.

ప్రాణం తీసిన 'డీబార్'

- డిగ్రీ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థి
- డీబార్ చేయడంతో మనస్తాపంతో ఆత్మహత్య
- ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు ఆదేశించిన వీసీ
- ఎగ్జామినర్ సస్పెన్షన్, సీఎస్, సిట్టింగ్ స్క్వాడ్‌కు నోటీసులు జారీ



పీయూ వీసీ, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పరీక్షలో చూచిరాతలు రాశాడన్న నెపంతో పాలమూరు యూనివర్సిటీ అధికారులు ఓ విద్యార్థిని డీబార్ చేయడం.. మనస్తాపంతో ఆ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా మాగనూర్ మండలం అచ్చంపేటకు చెందిన పూజారి ఆంజనేయులు (18) మక్తల్ పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మరికల్‌లోని ఓ పరీక్ష కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మొదటి సెమిస్టర్ పరీక్షకు హాజరైన ఆంజనేయులు.. చూచిరాతలకు పాల్పడుతున్నాడని పరీక్ష స్క్వాడ్ అధికారులు డీబార్ చేశారు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థి.. స్వగ్రామానికి చేరుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్పందించిన పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు విద్యార్థి పరీక్ష రాసిన కేంద్రంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజ్‌కుమార్, వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, పొలిటికల్ సైన్స్ హెచ్ఓడీ కుమారస్వామిలతో కూడిన కమిటీ తనిఖీలు చేపట్టారు. త్వరలో విచారణకు సంబంధించిన నివేదికను పీయూ వీసీకి అందించనున్నారు.

ఎగ్జామినర్ సస్పెన్షన్..

విద్యార్థి పరీక్ష రాసిన కేంద్రంలో విధులు నిర్వహించిన ఎగ్జామినర్‌ను విధుల నుంచి సస్పెన్షన్ చేయడంతో పాటు చీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్ స్క్వాడ్స్‌కు నోటీసులు ఇస్తున్నట్లు వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ ప్రకటనలో పేర్కొన్నారు. సదరు విద్యార్థి చూచిరాతలు రాసేందుకు అవసరమైన చీటీలు పరీక్ష కేంద్రంలోకి తీసుకొచ్చే క్రమంలో సదరు అధికారులు ఏం చేశారనే అంశంపై విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. వారు విధులు సరిగ్గా నిర్వహించకపోవడంతోనే విద్యార్థి పరీక్ష కేంద్రంలోకి చీటీలు తీసుకొచ్చి రాస్తూ పీయూ నుంచి వెళ్లిన స్క్వాడ్ అధికారులకు దొరికిపోయినట్లు తెలిసింది.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి..

విద్యార్థి ఆంజనేయులు కుటుంబానికి న్యాయం చేయాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజకు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము మాట్లాడుతూ స్క్వాడ్ అధికారులు తీసుకునే చర్యలపై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం, విద్యార్థులను ఇష్టారీతిగా డీబార్ చేయడం వల్ల ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నోటీసులు ఇస్తాం...

మరికల్ పరీక్ష కేంద్రంలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాం. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తాం. సంబంధిత పరీక్ష కేంద్రంలోని ఎగ్జామినర్, సీఎస్‌లకు నోటీసులకు ఇవ్వనున్నం. భవిష్యత్‌లో వారికి పరీక్షల విధులు కేటాయించకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– రాజ్‌కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, పీయూ

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి



విద్యార్థిని డీబార్ చేయడం వల్ల ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. ఈ విషయంపై వీసీతో పాటు అధికారులకు ఫిర్యాదు చేశాం. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

– బత్తిని రాము, పీయూ జేఏసీ చైర్మన్

పరీక్ష కేంద్రం మార్చాలని ఆందోళన..



పీయూ ఏఎస్‌డీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

మరికల్: మరికల్‌లో ఏర్పాటు చేసిన డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్ష కేంద్రాన్ని మార్చాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు పీయూ ఏఎస్‌డీ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌డీ మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు పరీక్ష కేంద్రాన్ని మార్చడం కుదరదని, వచ్చే అకాడమిక్ సంవత్సరం నుంచి పరీక్ష కేంద్రాన్ని మార్చే ఆలోచన చేస్తామని తెలిపారు. పరీక్ష తప్పితే మరో ఏడాది రాసుకునేందుకు అవకాశం ఉంటుందని, విద్యార్థులెవరూ ప్రాణాలను తీసుకోరాదని సూచించారు.

క్లుప్తంగా

కంటెయినర్ క్లీనర్ దుర్మరణం

అడ్డాకుల: కంటెయినర్ రివర్స్ తీసుకునే క్రమంలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఓ క్లీనర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన మూసాపేట మండలం వేముల సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. వేముల సమీపంలోని ఎస్‌జీడీ ఫార్మా కంపెనీకి కంటెయినర్‌లో మెటీరియల్‌ను తరలిస్తున్నారు. ఈ క్రమంలో కంటెయినర్ కంపెనీని దాటి కొంతదూరం ముందుకెళ్లింది. తుంకినీపూర్ మట్టిరోడ్డు వద్ద వెనక్కి వచ్చేందుకు కంటెయినర్ డ్రైవర్ చంద్రకాంత్ రివర్స్ తీసుకుంటుండగా.. క్లీనర్ శివకుమార్ (31) క్యాబిన్ బయటకు వచ్చి సైడ్ చూస్తున్న క్రమంలో విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. దీన్ని గమనించని డ్రైవర్.. కంటెయినర్‌ను వెనక్కి తీయడంతో క్లీనర్ శివకుమార్ టైర్ల కిందపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా ముర్కుందకు చెందిన వాడని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని యువకుడు..

బాలానగర్: రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని పెద్దాయపల్లి పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనోజ్‌కుమార్ (26) బుధవారం మండలంలోని హరిఓం పరిశ్రమ వద్ద పట్టాలు దాటుతుండగా వందేభారత్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.


వేధింపులు తాళలేక.. వివాహిత బలవన్మరణం

శాంతినగర్: అదనపు కట్నం తేవాలని అత్తింటి వారి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన వడ్డేపల్లి మండలం తిమ్మాజిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేశ్ కథనం మేరకు.. మల్దకల్ మండలం నీలుపల్లికు చెందిన సంగటి గోపాల్ రెండో కుమార్తె సరస్వతి (25)కి తిమ్మాజిపల్లికి చెందిన కురువ రుక్కయ్యతో 2019లో వివాహం అయింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెళ్లయిన ఏడాది వరకు సంసారం బాగానే సాగినా.. తర్వాత భర్త రుక్కయ్య, అత్త రాఘవేంద్రమ్మ అలియాస్ పద్మమ్మ అదనపు కట్నం కోసం సరస్వతిని శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించారు. వారి బాధలు భరించలేక మంగళవారం మధ్యాహ్నం తిమ్మాజిపల్లిలో పురుగుమందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. తండ్రి గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

పత్తి క్వింటాల్ రూ.6,610

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం పత్తికి క్వింటాల్ గరిష్ఠంగా రూ.6,610, కనిష్ఠంగా రూ.4,220 ధర దక్కింది. కందులకు క్వింటాల్ రూ.8,469, ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యానికి క్వింటాల్ గరిష్ఠంగా రూ.3,539, కనిష్ఠంగా రూ.2,501, హంస రకానికి గరిష్ఠంగా రూ.2,669, కనిష్ఠంగా రూ.2,029, సోనా ధాన్యం రూ.2,569, మొక్కజొన్నకు రూ.2,273, కనిష్ఠంగా చిట్టిముత్యాలు గరిష్ఠంగా రూ.3,567, కనిష్ఠంగా రూ.3,481, వేరుశనగ రూ.7,690 ధరలు లభించాయి.

కేఎస్పీ నీటి విడుదల ఖరారు


కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

- వచ్చేనెల 6నుంచి ఏప్రిల్ 25 వరకు యాసంగి పంటకు నీళ్లు
- ఒక్కో తడికి పది రోజుల చొప్పున విడుదల
- ఎడమ కాల్వ కింద 3వేలు, కుడి కాల్వ కింద 9వేల ఎకరాలకు సాగునీరు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల ఖరారు చేశారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారులు షెడ్యూల్‌ను బుధవారం ప్రకటించారు. దీంతో కొన్ని రోజులుగా సందిగ్ధంలో ఉన్న రైతులు యాసంగి పంట సాగు చేసుకునే అవకాశం వచ్చింది. ప్రస్తుతం కోయిల్‌సాగర్‌లో 31.8 అడుగుల మేర నీటినిల్వ ఉంది. ప్రాజెక్టు నీటిమట్టం స్థాయి 32.6 అడుగులు కాగా.. కేవలం 10 ఇంచుల నీటి మట్టం తక్కువగా ఉంది.

నీటిని వృథా చేయొద్దు..

తడుల వారీగా నీటిని విడుదల చేస్తాం. రైతులు నీటిని వృథా చేయకుండ సద్వినియోగం చేసుకోవాలి. యాసంగి పంటలకు నీటిని అందించిన తర్వాత వేసవిలో తాగునీటి అవసరాలకు నీరు సరిపోకుంటే జూరాల నుంచి నీటిని తీసుకుంటాం.

– ప్రతాప్‌సింగ్, ఈఈ, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

పాత ఆయకట్టు 12 వేల ఎకరాలు..
కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పాత ఆయకట్టు కింద ఉన్న 12వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని అధికారులు ప్రకటించారు. కుడి కాల్వ కింద మరికల్, ధన్వాడ, చిన్నచింతకుంట మండలాలకు కలిపి 9వేల ఎకరాలు, ఎడమ కాల్వ కింద దేవరకద్ర మండలంలోని 3వేల ఎకరాల పాత ఆయకట్టు ఉంది.

5 తడులుగా నీటి విడుదల..
యాసంగి పంటలకు 5 తడులుగా నీటిని విడుదల చేయడానికి షెడ్యూల్ ఖరారు చేశారు. ప్రతి తడి 10 రోజులు వదలనున్నారు. కొంత విరామం తర్వాత మరో తడి వదిలే విధంగా తేదీలను ప్రకటించారు.

నీటి విడుదల ఇలా..

మొదటి తడి: 2024 జనవరి 6నుంచి 16 వరకు - 10 రోజులు, విరామం: జనవరి 17నుంచి ఫిబ్రవరి 2వరకు - 15 రోజులు

రెండో తడి: ఫిబ్రవరి 3నుంచి 13వరకు - 10 రోజులు, విరామం: ఫిబ్రవరి 14నుంచి 24వరకు - 10 రోజులు

మూడో తడి: ఫిబ్రవరి 25నుంచి మార్చి 6 వరకు - 10 రోజులు, విరామం: మార్చి 7నుంచి 22వరకు - 15 రోజులు

నాలుగో తడి: మార్చి 23నుంచి ఏప్రిల్ 3వరకు - 10 రోజులు, విరామం: ఏప్రిల్ 4నుంచి 14 వరకు - 10 రోజులు

ఐదో తడి: ఏప్రిల్ 15నుంచి 25వ తేదీ వరకు - 10 రోజులు

ఎన్మన్‌బెట్లలో చేపల పంచాయితీ


ఎన్మన్‌బెట్ల నల్లచెరువులో ఇరువర్గాలను శాంతింపజేస్తున్న పోలీసులు

- దళితులు, మత్స్యకారుల మధ్య ఘర్షణ
- పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

కొల్లాపూర్ రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ఎన్మన్‌బెట్ల నల్లచెరువులో చేపలు పట్టే విషయంపై నెలకొన్న పంచాయితీ తారస్థాయికి చేరింది. చెరువు తమదంటే తమదని పేర్కొంటూ గ్రామంలోని మత్స్యకారులు, దళితులు ఘర్షణకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. నల్లచెరువులో చేపలు తామే పట్టాలని.. ఈ చెరువుపై పూర్తి హక్కులు తమకే ఉన్నాయని ఇరువర్గాలు పేర్కొంటూ బుధవారం చెరువు వద్ద వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాల వారిని శాంతింపజేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా నల్లచెరువులో చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువుపై పూర్తి హక్కులు తమకే ఉన్నాయన్నారు. అదేవిధంగా దళితులు మాట్లాడుతూ చెరువులో తమ భూములు మునకకు గురయ్యాయని, చెరువులో చేపలు పట్టే హక్కు తమకే ఉందని తెలిపారు. కాగా ఇరువర్గాలు ఒకరిపై ఒకరు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

చెప్పులు లేకుండా ప్రజాసేవ

- నార్లోనికుంట సర్పంచ్ అంకుంఠిత దీక్ష


చెప్పులు లేకుండా మండల కార్యాలయానికి వస్తున్న రామాంజనేయులు

దేవరకద్ర: ఓ యువ సర్పంచ్ చెప్పులు ధరించకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటివరకు చెప్పులు లేకుండా తిరుగుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దేవరకద్ర మండలంలో కొత్తగా ఏర్పడిన నార్లోనికుంట్ల గ్రామపంచాయతీ నుంచి మొదటి సర్పంచ్‌గా 22 ఏళ్ల వయ సు గల రామాంజనేయులు ఎన్నికయ్యారు. 2019 జనవరి 21న సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన అతడు.. నాటి నుంచి చెప్పులను వదిలేసి ప్రజాసేవకు అంకితమయ్యారు. ఇప్పటికీ చెప్పులు లేకుండా ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఎక్కడికి వెళ్లి నా పాదరక్షలు లేకుండానే తిరగడం గమనార్హం.

ఇది ఒక పవిత్ర పనిగా భావిస్తున్నా..

సర్పంచ్ పదవి ఎంతో పవిత్రమైనది. అందుకే ఆ పదవిలో ఉన్నన్ని రోజులు కాళ్లకు చెప్పులు వేసుకోరాదని నిర్ణయం తీసుకున్నా. ఎప్పటి వరకు ఉత్త కాళ్లతో తిరుగుతానో చెప్పలేను. సర్పంచ్‌గా ప్రజలకు తనవంతు సేవలు అందిస్తున్న. భవిష్యత్‌లో ఎంపీటీసీగా పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నా.

– రామాంజనేయులు, సర్పంచ్, నార్లోనికుంట్ల

నేడు పాలిటెక్నిక్ విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు

పెబ్బేరు రూరల్: వనపర్తి కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం సృజన టెక్ ఫెస్ట్–2023కు సంబంధించి జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్ తెలిపారు. పోటీల్లో మహబూబ్‌నగర్, గద్వాల, పెబ్బేరు, వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలల ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొని తమ ప్రాజెక్టులను వివరిస్తారని పేర్కొన్నారు. పరిశ్రమ నుంచి ఒక సాంకేతిక నిపుణుడు, ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ నుంచి ఒక విద్యావేత్త న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని, పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఒక ప్రాజెక్టును రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పోటీల పరిశీలకుడిగా నాగరాజు



మహబూబ్‌నగర్ క్రీడలు: నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నేటి (గురువారం) నుంచి ఈ నెల 23 వరకు కొనసాగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 విభాగం 67వ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు జిల్లాలోని కోయిలకొండ మండలం సూరారం జెడ్పీహెచ్‌ఎస్ పీఈటీ బి.నాగరాజు (బాలికల) పరిశీలకుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రాంరెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నాగరాజు సీనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడిగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. పలుమార్లు జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లకు కోచ్‌గా వ్యవహరించారు. గతంలో రెండుమార్లు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీలకు పరిశీలకుడిగా వెళ్లారు. నాగరాజు నియామకంపై జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, సహాయ కార్యదర్శి వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు దూమర్ల నిరంజన్, జగన్‌మోహన్‌గౌడ్, రాజవర్ధన్‌రెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు సాధిక్‌అలీ, రాఘవేందర్, ఉదయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యవసాయ మోటార్ల కేబుల్ చోరీ



ధరూరు: జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలోని నెట్టెంపాడు ప్రధాన కాల్వ వెంట రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్ల కేబుల్‌ను బుధవారం గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. దాదాపు 45 మంది రైతులకు చెందిన కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. ఉదయం పంటలకు నీళ్లు పారించేందుకు వెళ్లిన రైతులు.. కేబుల్ చోరీకి గురైన విషయాన్ని గుర్తించి లబోదిబోమన్నారు. రెండు నెలల కిందట కూడా కేబుల్‌ను చోరీ చేశారని, ప్రతి సంవత్సరం కేబుల్‌ను ఎత్తుకెళ్లడం పరిపాటిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కేబుల్ కొనుగోలుకు వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుందని వాపోయారు. కేబుల్ చోరీ విషయంపై బాధిత రైతులు రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఇటీవల వరుస చోరీలు చోటుచేసుకుంటుండటంతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

భూ తగాదా.. కర్రలతో పరస్పర దాడులు


కర్రలతో దాడులు చేసుకుంటున్న ఇరువర్గాలు

జడ్చర్ల: మండలంలోని బూరెడ్డిపల్లి శివారులో బుధవారం భూ వివాదం చేసుకొని ఇరువర్గాలు కర్రలతో దాడులు చేసుకున్నారు. దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ అయింది. వివరాల్లోకి వెళ్తే.. 44వ నంబర్ జాతీయ రహదారికి దగ్గరగా దాదాపు 6 గుంటల భూమికి సంబంధించి వివాదం నెలకొంది. మహబూబ్‌నగర్‌కు చెందిన ఒకవర్గం.. బూరెడ్డిపల్లికి చెందిన మరోవర్గం కొంతకాలంగా ఈ భూమి తమదంటే తమదంటూ ఘర్షణ పడుతున్నారు. ఇటీవల ఇక్కడ ఓ వర్గానికి చెందిన బైక్ కూడా దగ్ధమైంది. బుధవారం ఇదే భూమి హద్దురాళ్ల విషయమై ఘర్షణ తలెత్తి ఇరువర్గాలు కర్రలతో దాడులు చేసుకున్నారు. బూరెడ్డిపల్లికి చెందిన చందు, సత్తయ్య తదితరులు గాయపడ్డారు. అయితే దాడికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని.. చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

కంది సాగుపై రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి

తెలకపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని పర్వతాపూర్‌లో బుధవారం పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కంది సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం జాతీయ ఆహార భద్రతా పథకం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) ఆర్థిక సహకారంతో పాలెం కేవీకే దత్తత గ్రామాలైన పర్వతాపూర్, వసంతాపూర్, తుర్కపల్లిలలో దిగుబడిని ఇచ్చే నూతన రకం ఉజ్వల పీఆర్‌జీ 176 విత్తనాలను 3కిలోల చొప్పున 100 మంది రైతులకు అందించినట్లు తెలిపారు. ఈ పంట మధ్యస్థ కాలం కలిగి అధిక దిగుబడి ఇస్తుందన్నారు. డాక్టర్ బి.రాజశేఖర్ మాట్లాడుతూ పంటసాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. అనంతరం తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులపై కీటక శాస్త్రవేత్త డా. శైలజ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డా. లావణ్య, ఏఈఓ భార్గవ్ సాగర్, రైతులు శివ, నారాయణ, నర్సింహ, రాజేష్ పాల్గొన్నారు.

పంటల నిల్వలో జాగ్రత్తలు పాటించాలి
మదనాపురం: పంటల నిల్వలో జాగ్రత్తలు పాటించాలని ఎన్‌ఐపీహెచ్‌ఎం డైరెక్టర్ డా. మర్యాదాసు రైతులకు సూచించారు. వనపర్తి జిల్లా మదనాపురంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ మొక్కల ఆరోగ్య పరిరక్షణ కేంద్రం వారి సహకారంతో రైతులకు జాతీయ గిడ్డంగుల వినియోగం, పంటల నిల్వల్లో వ్యాపించే చీడ పురుగులపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లోని గిడ్డంగులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆహార ధాన్యాల నిల్వల్లో ఆశించే కీటకాలను అరికట్టేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో కేవీకే హెడ్ దాదాసాహెబ్ కొగారే, శాస్త్రవేత్తలు అనిల్ కుమార్, రాజేందర్‌రెడ్డి, సురేష్‌కుమార్, మార్కెట్ సిబ్బంది జయలక్ష్మి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు పురుగుల అన్నంపై విచారణ

- విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తొలగింపు


ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో విచారణ నిర్వహిస్తున్న ఎస్సీ సంక్షేమశాఖ డీడీ పాండు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో సోమవారం రాత్రి విద్యార్థినులకు పురుగులు, వెంట్రుకలతో కూడిన అన్నం వడ్డించడంపై మంగళవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ సంక్షేమశాఖ డీడీ పాండుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీడీ.. బుధవారం సంబంధిత హాస్టల్‌లో విచారణ చేపట్టారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అదేవిధంగా సిబ్బంది విధినిర్వహణపై ఆరా తీశారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థినులకు నాసిరకంగా భోజనం అందిస్తున్నారని ఆయన తేల్చారు. దీంతో ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంపై డీడీని వివరణ కోరగా.. హాస్టల్‌లో వార్డెన్ వంట సామగ్రి సక్రమంగా ఇస్తున్నప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యం వహించారని, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఇద్దరు సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో 22 మేక పిల్లలు మృత్యువాత


కుక్కల దాడిలో మృతిచెందిన మేక పిల్లలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లిలో బుధవారం కుక్కలు దాడి చేయగా.. 22 మేక పిల్లలు మృత్యువాత పడ్డాయి. బాధితుడు గొల్ల వెంకటయ్య బోరున విలపిస్తూ.. వాపోయాడు. ఇంటి కంపౌండ్‌లో ఇనుప కంచె ఏర్పాటు చేసి అందులో మేకపిల్లలను ఉంచారు. వెంకటయ్య వ్యవసాయ పొలం వద్దకు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేకపోయే సరికి గ్రామంలోని కుక్కలు కంచెలోకి చొరబడి మేక పిల్లల మందపై దాడి చేశాయి. కుక్కల దాడిలో 22 మేక పిల్లలు చనిపోయాయని తనకు రూ.1.20 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు. రోజు మేకలను మేపుకొని జీవించే వెంకటయ్య తీవ్రంగా నష్టపోయాడని, అతడిని ప్రభుత్వం ఆదుకోవాలని యాదవ సంఘం నాయకులు మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు.

పోలీసుల అదుపులో అనుమానితులు?

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల సమీపంలోని చాకిరేవుగుట్ట పరిసర ప్రాంతంలో మంగళవారం రాత్రి గుప్తనిధుల కోసం పూజలు నిర్వహిస్తున్న కొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. గుప్తనిధుల కోసం యత్నిస్తున్నారన్న సమాచారం అందుకున్న లింగాల, బల్మూర్ పోలీసులు.. అప్పాయపల్లి, లింగాల అటవీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో చాకిరేవుగుట్ట వద్ద పూజలు చేస్తున్న కొందరిని పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. మొత్తం ఆరుగురు వ్యక్తులు ఉండగా.. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు పూజారులు కూడా ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసుల వివరణ కోరగా.. కొంతమందిని విచారించామని, పూర్తి విచారణ అనంతరం వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

ప్రగతి పథంలో పీఏసీఎస్

ఉమ్మడి జిల్లాలోనే ఉప్పునుంతల సింగిల్‌విండో ముందంజ

- రూ.4 కోట్ల మిగులు బడ్జెట్, ఆస్తులు
- రైతుల ఆర్థికాభివృద్ధికి ఎనలేని సహకారం
- విత్తనాల పంపిణీ నుంచి.. ధాన్యం కొనుగోళ్ల వరకు సేవలు
- కొరత లేకుండా ఎరువుల సరఫరా


ఉప్పునుంతల సింగిల్‌విండో కార్యాలయం

ఉప్పునుంతల: ఒకప్పుడు నష్టాల్లో ఉన్న ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ప్రస్తుతం రూ.4 కోట్ల మిగులు బడ్జెట్, ఆస్తులతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే ముందంజలో నిలుస్తోంది. రైతుల ఆర్థికాభివృద్ధికి ఎనలేని సహకారం అందిస్తూ ప్రగతి పథంలో పయనిస్తోంది. రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ ఆదర్శవంతంగా ముందుకు సాగుతోంది. పంట రుణాలను రెగ్యులర్‌గా రెన్యువల్ చేయిస్తూ పంటల బీమా రైతులకు వర్తించేవిధంగా జాగ్రత్తలు తీసుకుంటోంది. దీంతో రైతుల్లో బలమైన విశ్వాసం ఏర్పడి అన్నిరకాల రుణాలు తీసుకోవడానికి మొగ్గుచూపుతున్నారు. ఈ పీఏసీఎస్‌లో 11,620 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు.

వైఎస్ హయాంలో శాశ్వత భవనం..
2005కు పూర్వం పూర్తిగా దివాలా తీసి, శాశ్వత భవనం కూడా లేకుండా చతికిలపడిన ఉప్పునుంతల పీఏసీఎస్.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి అభివృద్ధి బాటలో పయనిస్తోంది. పీఏసీఎస్‌లను పటిష్ట పర్చడానికి వైఎస్ చేసిన కృషిలో భాగంగా 2008లో రూ.11 లక్షలతో ప్రధాన రోడ్డుపై శాశ్వత భవనం నిర్మించారు. 2014లో సీడీఎఫ్ నిధులు రూ.3లక్షలతో కలిపి మొత్తం రూ.10 లక్షలతో పీఏసీఎస్ భవనం రెండో అంతస్తును నిర్మించారు. ప్రస్తుతం సంఘం పాలకవర్గం, సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడానికి వీలుగా విశాలమైన భవనం ఉంది. దాంతోపాటు గ్రామంలోని పాతకోటలో స్థలాన్ని సమకూర్చుకొని నాబార్డు నిధులు రూ.63.40 లక్షలతో 2,100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాం నిర్మించారు. గోదాంకు అనుసరించి రూ.21 లక్షలతో ఎరువులు నిల్వ చేయడానికి మరో గోదాం ఏర్పాటు చేశారు. సీడీఎఫ్ నిధులు రూ.3 లక్షలతో విత్తనాల కోసం మరో మినీ గోదాం నిర్మించారు. అంతేకాకుండా ఉప్పునుంతలలో అదనపు గోదాం, ఉప్పరిపల్లి, మొల్గర గ్రామాల్లో దాదాపు 4వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాములను నిర్మించారు. మొల్గర, కాంసానిపల్లి సమీపంలో రెండు పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఉప్పునుంతల గ్రామపంచాయతీ సమీపంలో ఉన్న స్థలంలో నాబార్డు నిధులు రూ. 1.32 కోట్లతో పీఏసీఎస్ బ్యాంక్ నూతన భవన నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నాయి. ప్రస్తుతమున్న పీఏసీఎస్ భవనంలో సూపర్ మార్కెట్ ఏర్పాటు చేయనున్నట్లు సీఈఓ రవీందర్‌రావు తెలిపారు.

రైతులకు విరివిగా రుణాలు..
సంఘ సభ్యులుగా ఉన్న రైతులకు పంట, దీర్ఘకాలిక రుణాలను విరివిగా ఇస్తున్నారు. వాటితో పాటు బంగారు ఆభరణాలపై రుణాలు ఇతర చిరువ్యాపారులకు రుణాలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు పీఏసీఎస్ నుంచి రైతులకు రూ.29 కోట్ల పంట రుణాలు ఇచ్చారు. దీర్ఘకాలిక రుణాలు రూ.14 కోట్లు, బంగారు ఆభరణాలపై రూ.8.10 కోట్లు, చిరు వ్యాపారులకు రూ.18 లక్షల రుణాలు ఇచ్చారు.

ధాన్యం కొనుగోలుతో రూ.1.15 కోట్ల రాబడి..
పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇంతకు ముందు మొక్కజొన్న, కంది పంటలను కూడా కొనుగోలు చేసేవారు. ఐదేళ్ల వ్యవధిలో రూ. 20 కోట్లకు పైబడి వ్యాపారం చేశారు. దీంతో సివిల్‌సప్లై శాఖ నుంచి కమీషన్ రూపంలో రూ.1.15 కోట్ల రాబడిని సంఘం ఆర్జించింది. వానాకాలంలో రైతులు సాగు చేసిన వరిపంట కోతలు ప్రారంభమైన నేపథ్యంలో పీఏసీఎస్ ద్వారా ధాన్యం కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పౌల్ట్రీఫాం కోసం రుణం తీసుకున్నా



పౌల్ట్రీఫాం నిర్మాణం కోసం నా పేరిట, నా కొడుకు నవీన్ పేరిట పీఏసీఎస్‌లో రూ.4.38 లక్షల రుణం తీసుకున్నాం. ఐదేళ్లలో రుణం కంతుల వారీగా రూ.5.87 లక్షలు కట్టాల్సి ఉండగా.. నాబార్డు ద్వార అందులో రూ.1.86 లక్షల సబ్సిడీ వచ్చింది. ఆ అప్పు మొత్తం కట్టేశాం. ప్రస్తుతం పంట రుణం రూ.1.10లక్షలు ఇచ్చారు. బ్యాంక్ వారే సకాలంలో రుణం రెన్యువల్ చేస్తుండటంతో సబ్సిడీ లేదా పంటల బీమా వస్తుంది.

– మదనాగుల లక్ష్మమ్మ, రైతు, ఉప్పునుంతల

ఇబ్బంది లేకుండా ధాన్యం విక్రయిస్తున్నాం



పీఏసీఎస్ ఆధ్వర్యంలో దుందుభీ వాగు సమీపంలో ఏర్పాటు చేసిన గోదాం వద్ద ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం విక్రయిస్తున్నాం. నిర్ణీత సమయంలోగా బ్యాంక్ ఖాతాలోకి డబ్బులు వస్తున్నాయి. మా పొలం పక్కనే గోదాం నిర్మించడం సౌకర్యవంతగా ఉంది. సహకార బ్యాంక్‌లో రుణాలు తీసుకున్న రైతులకు ఎక్కువ శాతం పంటల బీమా డబ్బులు వస్తున్నాయి.

– నడింపల్లి శ్రీనివాస్‌గౌడ్, రైతు, మొల్గర

సంఘం అభివృద్ధికి కృషి..



సంఘం అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నాం. నాబార్డు, సీడీఎఫ్ సహకారంతో పీఏసీఎస్‌కు నూతన భవనం, కొత్తగా గోదాములు నిర్మించాం. సంఘం సభ్యులుగా ఉన్న రైతులకు అర్హత మేరకు అన్నిరకాల రుణాలు ఇస్తున్నాం. అదే స్థాయిలో రుణాల రికవరీ చేస్తున్నాం. పీఏసీఎస్ అభివృద్ధికి పాలకవర్గం, సీఈఓతో పాటు సిబ్బంది కృషి ఎంతగానో ఉంది.

– సత్తు భూపాల్‌రావు, పీఏసీఎస్ చైర్మన్, ఉప్పునుంతల

క్లుప్తంగా...



సీఎం జగన్‌కు అక్షరమాల!

సీఎం జగన్ పుట్టిన రోజును పురస్కరించుకొని నంద్యాలకి చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్.. అక్షరాలతో జగనన్న జీవిత చరిత్రను వేశారు. ఏ 3 డ్రాయింగ్ షీట్‌పై మైక్రో పెన్నుతో సీఎం జగన్ పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్న విషయాలను చిత్రంలో రాశారు. వైఎస్సార్ మృతి, ఓదార్పు యాత్ర, ప్రజాసంకల్ప యాత్ర, సీఎంగా ప్రమాణస్వీకారం, నవరత్నాలు తదితరాలను చిత్రంలో చూపించారు. – నంద్యాల(అర్బన్)

22న 'టైంస్లాట్ టోకెన్లు' రద్దు

అదే రోజు మధ్యాహ్నం నుంచి తిరుపతిలోని 9 ప్రాంతాల్లో 'వైకుంఠ'టోకెన్ల జారీ

తిరుమల: శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 23– జనవరి 1 వరకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. 22న అదేరోజు శ్రీవారి దర్శనానికి సంబంధించి తిరుపతిలో మంజూరు చేసే సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లను రద్దు చేసింది. భక్తులు తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా సర్వదర్శనంలో ఆరోజు శ్రీవారిని దర్శించుకోవచ్చు. 22న మధ్యాహ్నం 2 గంటల నుంచి తిరుపతిలోని 9 ప్రాంతాల్లో వైకుంఠ ద్వార దర్శన టోకెన్లను జారీ చేయనుంది. 23న ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఆలయ మాడ వీధుల్లో దర్శనమిస్తారు. నాదనీరాజనం వేదికపై సంపూర్ణ భగవద్గీత అఖండ పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తారు. 24న తెల్లవారుజామున శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవం జరుగనుంది. డిసెంబర్ 22–24 వరకు, డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల్లో శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ వీఐపీలకు, కుటుంబ సభ్యులకు మాత్రమే పరిమిత సంఖ్యలో బ్రేక్ దర్శనం ఇవ్వనుంది.

ఆరోగ్యానికి ఆట బాట

రెండు ప్రధాన లక్ష్యాలతో బెంచ్‌మార్క్‌లా 'ఆడుదాం ఆంధ్ర' • గ్రామీణుల్లో ఆరోగ్యకర జీవనానికి వ్యాయామం, క్రీడల వైపు ప్రోత్సాహం

- మట్టిలో మాణిక్యాలను అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టడమే లక్ష్యం
- 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 47 రోజుల పాటు క్రీడా సందడి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పీవీ సింధు ఇతర క్రీడాకారులు. చిత్రంలో మంత్రి రోజా

సాక్షి, అమరావతి: క్రీడా రంగంలో 'ఆడుదాం ఆంధ్ర'కార్యక్రమాన్ని బెంచ్ మార్క్‌లా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. దీనిద్వారా గ్రామాల్లో ఆరోగ్యకర జీవనాన్ని పెంపొందించడంలో భాగంగా వ్యాయామం, క్రీడలను ప్రోత్సహించడం ఒక ప్రధాన కారణమైతే.. మట్టిలోని మాణిక్యాల ప్రతిభను వెలికితీసి ప్రపంచ వేదికలపై నిలబెట్టే మహోన్నత ఉద్దేశంతో ఐదు రకాల క్రీడాలను ప్రమోట్ చేస్తున్నామన్నారు. ఈ రెండు ప్రధానాంశాలే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మెగా క్రీడాటోర్నీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఏటా డిసెంబరులో 'ఆడుదాం ఆంధ్ర'ను నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈనెల 26వతేదీ నుంచి ఫిబ్రవరి 10 వరకు 47 రోజుల పాటు పండుగ వాతావరణంలో క్రీడా పోటీలు చేపట్టాలని నిర్దేశించారు. ల15 వేల గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రకు అన్ని రకాలుగా సన్నద్ధమవ్వాలని సూచించారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ముఖ్యమంత్రి జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

ఐదు రకాల క్రీడలు..

ప్రజారోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. విలేజ్ క్లినిక్స్ ద్వారా ప్రివెంటివ్ కేర్‌పై దృష్టి పెట్టాం. ప్రివెంటివ్ కేర్ మరింత సమర్థంగా పని చేయాలంటే నిత్యం వ్యాయామం అవసరం. ప్రివెంటివ్ కేర్‌లో భాగంగా ప్రతి ఇంటిలో ఫిజికల్ యాక్టివిటీస్ పెరిగితే భవిష్యత్తులో అవన్నీ తగ్గుతాయి. అందుకే ఆడుదాం ఆంధ్రను ప్రాముఖ్యత ఉన్న అంశంగా గుర్తించాలి. గ్రామీణ క్రీడాకారులకు సరైన గుర్తింపు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కుతుంది. ఇందులో భాగంగానే ఐదు రకాల క్రీడలు.. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ప్రమోట్ చేయాలి. ప్రతిభగల క్రీడాకారులకు ఉన్నతస్థాయి శిక్షణ అందించే దిశగా అడుగులు వేయాలి. పోటీల ప్రారంభానికి ముందే అన్ని స్థాయిల్లో పెద్ద ఎత్తున పండుగ వాతావరణంలో సన్నాహక కార్యక్రమాలు చేపట్టాలి. 3 కిలోమీటర్ల మారథాన్ లాంటి కార్యక్రమాలు జిల్లా స్థాయిలో నిర్వహించాలి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ప్రతిభకు నగదు బహుమతి

క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రథమ విజేతలకు రాష్ట్రస్థాయిలో రూ.5 లక్షలు, జిల్లాలో రూ.60 వేలు, నియోజకవర్గంలో రూ.35 వేలు చొప్పున నగదు బహుమతి ఇస్తున్నాం. ఈ క్రీడలకు సంబంధించి ద్వితీయ బహుమతి కింద రాష్ట్ర స్థాయిలో రూ.3 లక్షలు, జిల్లాలో రూ.30 వేలు, నియోజక వర్గంలో రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 లక్షలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున అందజేస్తాం. బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలకు రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి రూ.2 లక్షలు, జిల్లాలో రూ.35 వేలు, నియోజకవర్గంలో రూ.25 వేలు, ద్వితీయ బహుమతి కింద వరుసగా రూ.లక్ష, రూ.20 వేలు, రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందచేస్తాం.

రాష్ట్ర విద్యుత్ రంగంలో మరో మైలురాయి

ఎన్‌టీటీపీఎస్‌లో 8వ యూనిట్ ప్రారంభం.. 800 మె.వా వాణిజ్య ఉత్పత్తికి శ్రీకారం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పాదన సంస్థ (ఏపీజెన్‌కో) మరో మైలురాయిని అధిగమించింది. ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (డాక్టర్ ఎన్‌టీటీపీఎస్)లోని 8వ యూనిట్ వాణిజ్య ఉత్పత్తికి విజయవంతంగా శ్రీకారం చుట్టింది. కొత్తగా నిర్మించిన 800 మెగావాట్ల ఎనిమిదో యూనిట్ 72 గంటలపాటు నిర్విరామంగా వందశాతానికిపైగా సామర్థ్యంతో పనిచేయడంతో.. బుధవారం ఉదయం 10.45 గంటలకు విద్యుత్ వాణిజ్య ఉత్పత్తి (కమర్షియల్ ఆపరేషన్ డేట్– సీవోడీ) ప్రారంభమైంది. ఏపీజెన్‌కో ఎండీ, ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎస్.చక్రధర్‌బాబు సమక్షంలో సంస్థ డైరెక్టర్లు, ఉన్నతాధికారులు, సిబ్బంది హర్షధ్వానాల మధ్య ఏపీజెన్‌కో, ఏపీట్రాన్స్‌కో, ఏపీపీసీసీ, ఏపీ డిస్కంల ప్రతినిధులు బుధవారం ఉదయం సీవోడీ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని 1,760 నుంచి 2,560 మెగావాట్లకు పెంచుకుని ఏపీజెన్‌కోలో డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ అతి పెద్ద ఉత్పత్తి కేంద్రంగా ఆవిర్భవించింది. డాక్టర్ ఎన్‌టీటీపీఎస్‌లో స్టేజ్–5 కింద 800 మెగావాట్ల సామర్థ్యంతో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన ఎనిమిదో యూనిట్ కోవిడ్ లాంటి కష్టకాలాన్ని, అనేక సవాళ్లను అధిగమించి వాణిజ్య ఉత్పత్తి సాధించింది. ఈ సందర్భంగా సంస్థ ఎండీ కేక్ కట్‌చేసి, కొత్త యూనిట్ నిర్మాణంలో భాగస్వాములై సేవలందించిన పలువురిని జ్ఞాపికలతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాలుగా సంపూర్ణ సహాయ సహకారాలు అందించడంవల్లే ఎనిమిదో యూనిట్ నిర్మాణపనులు పూర్తిచేసి సీవోడీ చేసుకోగలిగామని ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు చెప్పారు. సీఎం వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రోత్సహించడంవల్లే ఇది సాధ్యమైందన్నారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి అందించిన సహకారానికి ధన్యవాదాలు తెలిపారు.

8,789 మెగావాట్లకు పెరిగిన జెన్‌కో సామర్థ్యం

డాక్టర్ ఎన్‌టీటీపీఎస్‌లో 800 మెగావాట్ల ఎనిమిదో యూనిట్ సీవోడీతో జెన్‌కో థర్మల్ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం 6,610 మెగావాట్లకు పెరిగింది. జెన్‌కో మొత్తం ఉత్పాదన సామర్థ్యం 8,789 మెగావాట్లకు పెరిగింది. ప్రస్తుతం జెన్‌కోకి 6,610 మెగావాట్ల థర్మల్, 1,773.600 మెగావాట్ల హైడల్, 405.426 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పాదన సామర్థ్యం ఉంది. మొత్తం రాష్ట్ర గ్రిడ్ డిమాండ్‌లో 55 నుంచి 60% వి ద్యుత్ అందించే సామర్థ్యం ఏపీ జెన్‌కోకు వచ్చింది.

నిస్సహాయుల పట్ల కరుణ చూపాలి..

- ఆకాశమంత సహనం ఉండాలి
- అప్పుడే దేవుడికి నచ్చిన బిడ్డలుగా ఉంటాం
- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: నిస్సహాయుల పట్ల కరుణ చూపించడం, ఆకాశమంత సహనంతో మెలగడం.. ప్రతి మనిషి అలవాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అప్పుడే మనం దేవుడికి నచ్చిన బిడ్డలుగా ఉంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రైస్తవ మత పెద్దలతో కలిసి కేక్ కట్‌చేసి, క్యాండిల్స్ వెలిగించి తెలుగు రాష్ట్రాల ప్రజలకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'క్రిస్మస్ పండుగ వస్తున్న శుభసందర్భంలో ఈ సాయంత్రం పూట అడ్వాన్స్‌గా క్రిస్మస్‌ను జరుపుకొంటున్నాం. ఈ మంచి రోజులో ఇక్కడికి వచ్చిన అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలే కాకుండా మొత్తం తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి మీ అన్నగా, తమ్ముడిగా మెర్రీ క్రిస్‌మస్ ఇన్ అడ్వాన్స్ తెలియజేస్తున్నాను. దేవుని విషయంలో మనందరికీ తెలిసిన ఒక్కటే ఒక్క విషయం... మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ చూపించడం. ఆకాశమంత సహనం ప్రతి మనిషిలోనూ అలవాటు చేసుకోవడం. అవధులు లేని త్యాగం, మరీ ముఖ్యంగా శత్రువుల పట్ల కూడా క్షమాగుణం. ఇవన్నీ కష్టమైన విషయాలు అయినప్పటికీ ఆ ప్రతి విషయాన్ని మనం ఎప్పుడు గ్రహిస్తామో, ఎప్పుడైతే వాటిని మనసారా పాటించాలని తాపత్రయపడతామో.. అప్పుడు మనం కూడా దేవుడు నచ్చిన బిడ్డలుగా ఉంటాం. దేవుడు ఆ మనసు మనందరికీ ఇవ్వాలని, రాష్ట్రాన్ని, ప్రజలను ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటూ క్రిస్మస్ సందర్భంగా ఇక్కడున్నవారితోపాటు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అందరికీ మరోసారి మెర్రీ క్రిస్మస్ తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నా..'అని చెప్పారు. రాష్ట్రంలో పలు రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారిని సీఎం వైఎస్ జగన్ సన్మానించి, అవార్డులు అందజేశారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఇచ్చిన విందులో క్రైస్తవ మతపెద్దలు, దైవసేవకులతో కలిసి సీఎం జగన్ పాల్గొన్నారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు

- తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ సంబరాలు

సాక్షి,అమరావతి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని ఈనెల 21 (గురువారం) రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో భారీఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా ఏర్పాట్లుచేశాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మొక్కలు నాటడంతో పాటు అన్నదానం, వస్త్రదానాలు చేయనున్నారు. అలాగే, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తారు. రక్తదాన శిబిరాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం పర్యవేక్షకులు, శాసనమండలిలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కోట్లాది మంది అభిమానులతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు సైతం పాల్గొంటారన్నారు. అలాగే, వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద గురువారం ఉ.9.30 గంటలకు దివంగత సీఎం వైఎస్సార్‌కి నివాళి అర్పించడంతో కార్యక్రమాలు మొదలవుతాయని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సాంస్కృతి కార్యక్రమాలు, కేక్ కటింగ్, దుస్తులు, బహుమతుల పంపిణీ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇక ఇప్పటికే రెండ్రోజులు ముందే దేశ, విదేశాల్లో వైఎస్సార్‌సీపీ అభిమానులు ఎన్నో సేవా కార్యక్రమాలు ప్రారంభించారని అప్పిరెడ్డి చెప్పారు.

బాబు ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలకు నేరస్వభావాన్ని ఆపాదించడానికి వీల్లేదని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ హైకోర్టుకు నివేదించారు. ఉచిత ఇసుక విధానంలో తప్పులు జరిగి ఉంటే కేసు నమోదుకు మూడేళ్లు ఎందుకు ఆగారని ప్రశ్నించారు. ఇన్నేళ్ల తరువాత కేసు ఎందుకు నమోదు చేశారన్న దానికి కారణాలు చెప్పడం లేదన్నారు. ఇసుక విధానం ద్వారా చంద్రబాబుకు లబ్ధిచేకూరినట్లు సీఐడీ ఎలాంటి ఆధారాలను చూపలేదని చెప్పారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. అందువల్ల అవినీతి నిరోధక చట్టం కింద చంద్రబాబును ప్రాసిక్యూట్ చేయాలంటే సెక్షన్ 17(ఏ) కింద గవర్నర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పిటిషనర్ చంద్రబాబు వయసు, అనారోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉచిత ఇసుక పథకం పేరుతో కోట్ల రూపాయల మేర ఖజానాకు నష్టం కలిగించినందుకు సీఐడీ పలువురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

'కిలిమంజారో' అవకాశం

- దాతలు సహకరిస్తే పర్వతం అధిరోహిస్తానని విన్నపం



అచ్చంపేట రూరల్: జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, సిక్కిం రాష్ట్రాల నుంచి సుమారు 30 మంది విద్యార్థులు నార్త్ సిక్కింలోని ఏఎల్‌డీ– 22 అనే శిఖరాన్ని అధిరోహించారు. అందులో తెలంగాణ నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ముద్దుబిడ్డ ఉన్నాడు. అతడే నల్లమల ప్రాంతంలోని నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం చిట్లంకుంటకి చెందిన ముడావత్ జైరామ్. 5,300 మీటర్లు (17,300 అడుగులు) ఎత్తున ఉన్న ఏఎల్‌డీ– 22 శిఖరం అధిరోహించి, ఆ శిఖరంపై మన భారతీయ జెండా ఎగురవేసిన సన్నివేశం చాలా ఆనందాన్ని, ఉత్సాహాన్ని కలిగించిందని తెలియజేశాడు. ఆఫ్రికలోని టాంజానియా కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడానికి తనకు మరో అవకాశం వచ్చిందన్నారు. అందుకు రూ.3 లక్షల ఖర్చు అవుతుందని చెప్పారు. విద్యార్థి దశలో అంత డబ్బులేదని, దాతలు ముందుకు వచ్చి అవకాశం కల్పిస్తే.. మన దేశ కీర్తిప్రతిష్టలు నిలుపుతానని చెప్పుకొచ్చాడు. పేదరికంలో ఉన్న తనను ఆర్థికంగా ఆదుకుంటే కిలిమంజారో పర్వతాన్ని అధిరోషించి తీరుతానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశాడు.

తెలుగు రాష్ట్రాలకు ఎంతో ఉపయోగకరం

- నాగలదిన్నె బ్రిడ్జిని ప్రారంభించిన ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



నాగలదిన్నెలో హైలెవల్ వంతెనను ప్రారంభిస్తున్న కర్నూలు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, చిత్రంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తదితరులు

అయిజ/నందవరం: ఇరు తెలుగు రాష్ట్రాలకు నాగలదిన్నె బ్రిడ్జి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం నందవరం మండలంలోని నాగలదిన్నె గ్రామ సమీపంలో తుంగభద్ర నదిపై నిర్మించిన బ్రిడ్జిని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైలెవల్ వంతెన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన, జిల్లా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల వెంకటరెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, తెలంగాణ రాష్ట్రం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు రిబ్బన్ కట్ చేసి వంతెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి మాట్లాడుతూ.. 2009లో తుంగభద్ర నది ఉధృతిలో పాత బ్రిడ్జి కొట్టుకుపోయిందన్నారు. 2011లో ఎమ్మెల్యే చెన్న కేశవరెడ్డి కొత్త బ్రిడ్జి నిర్మాణం మంజూరు చేయించారన్నారు. దాదాపు 10 ఏళ్ల పాటు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందన్నారు. కరోనా విపత్తు, తెలంగాణ వైపు భూ సేకరణ వంటి ఎన్నో అడ్డంకులు వచ్చినా ఆయన పట్టుబట్టి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించారన్నారు. అటు తెలంగాణ, ఇటు ఆంధ్ర ప్రజలకు బంధుత్వాలు ఉన్నాయని, వారందరికీ ఈ బ్రిడ్జి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాబోయే కాలానికి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారన్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్న కేశవరెడ్డి మాట్లాడుతూ.. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి రూ.42 కోట్ల అంచనాతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేశామన్నారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయన్నారు. గత తెలంగాణ ప్రభుత్వంతో సంప్రదించి భూ సేకరణ సమస్యను పరిష్కరించామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాంట్రాక్టరుకు బకాయిలు చెల్లించి వంతెన నిర్మాణానికి కావాల్సిన నిధులు సైతం మంజూరు చేసి పూర్తి చేయించిందన్నారు. అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం కోసం రెండు రాష్ట్రాల ప్రజలు దశాబ్దకాలంగా ఎదురు చూశారని, ఎట్టకేలకు రెండు రాష్ట్రాల బంధాలకు వంతెన వారధిగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. బ్రిడ్జి ప్రారంభోత్సవంలో కర్నూలు కలెక్టర్ సృజన, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, నియోజకవర్గ నాయకులు బసిరెడ్డి, భీమిరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఆదోని డివిజన్ ఈఈ కృష్ణారెడ్డి, డీఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథరామయ్య, సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐలు తిమ్మయ్య, తిమ్మారెడ్డి, శరత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాగలదిన్నె బ్రిడ్జిపై కొనసాగుతున్న రాకపోకలు

ప్రజలు భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

- తంబిహళ్లి పీఠాధిపతి విద్యాసింధు మాధవతీర్థులస్వామి



ఆదిశిలా క్షేత్రంలో టేకు తలుపులు, వంటషెడ్‌ను ప్రారంభిస్తున్న పీఠాధిపతి, ఎమ్మెల్యే

మల్దకల్: ప్రజలు భక్తిభావాన్ని అలవర్చుకోవాలని కర్ణాటకలోని తంబిహళ్లి పీఠాధిపతి విద్యాసింధు మాధవతీర్థులస్వామి అన్నారు. బుధవారం ఆది శిలాక్షేత్రానికి వచ్చిన ఆయనను ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డితో పాటు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా.. ఆలయంలో స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో సంస్థాన పూజలు చేసి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు ముందు ప్రతి ఏటా ఆదిశిలా క్షేత్రంలో స్వామిజీ సంస్థాన పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని.. ప్రజలందరూ భక్తిమార్గంలో నడుచుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని వివరించారు. ఆలయ ముఖద్వార మార్గంలో రూ.14 లక్షలతో దాతలు శ్యాంసుందర్, బాణాల శశిపాణి ఏర్పాటు చేసిన రెండు టేకు తలుపులు, మాజీ ఎంపీపీ సత్యారెడ్డి రూ.20 లక్షలతో నిర్మించిన వంటల షెడ్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి పీఠాధిపతి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తిమ్మారెడ్డి, మధుసూదన్ రెడ్డి, సీతారామిరెడ్డి, రామచంద్రారెడ్డి, రమేష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్, బాబురావు, ఆలయ అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

దిగి వచ్చిన ఉల్లి



దేవరకద్ర మార్కెట్‌లో తూకం వేస్తున్న ఉల్లి

- తగ్గుముఖం పట్టిన ధరలు

దేవరకద్ర: సామాన్య ప్రజలు ఉల్లి ధరలను చూసి ఉక్కిరి బిక్కిరి అవుతున్న తరుణంలో ఉల్లి ధర ఒక్కసారిగా దిగివచ్చింది. రెండు వారాల కిందటి వరకు రూ.6 వేలకు క్వింటాల్ ఉన్న ఉల్లి.. ప్రస్తుతం సగానికి సగం ధర పడిపోయింది. మార్కెట్‌లో రూ.60 నుంచి రూ.80 వరకు కిలో ఉల్లి ఉన్న ధర ప్రస్తుతం రూ.30కి దిగి వచ్చింది.

దేవరకద్ర మార్కెట్‌లో...

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం జరిగిన ఉల్లి వేలంలో ధరలు తగ్గుముఖం పట్టాయి. పలు గ్రామాల నుంచి రైతులు మార్కెట్‌కు అమ్మకానికి ఉల్లిని తీసుకొచ్చారు. మార్కెట్ వ్యాపారులతో పాటు ఇతర ప్రాంతాల వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. క్వింటాల్ ఉల్లి ధర గరిష్టంగా రూ.2,500, కనిష్టంగా రూ.1,800ల వరకు ధరలు పలికాయి. 45 కిలోల ఉల్లి బస్తా ఎక్కువగా రూ.1,250, తక్కువగా రూ.900 వరకు విక్రయించారు.

ఎగుమతుల నిలుపుదలతో...

దేశం నుంచి ఉల్లి ఎగుమతులను నిలిపివేయడంతోనే ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు తెలిపారు. విదేశాలకు తాత్కాలికంగా ఎగుమతులను నిలపడంతో మార్కెట్‌లో ఉల్లికి డిమాండ్ పడిపోయిందని చెప్పారు. కొత్త మార్కెట్ రావడం ప్రారంభమైందని, జనవరి నుంచి ఉల్లి పంట దిగుమతులు పెరిగే అవకాశం ఉంది, అప్పుడు ధరలు మరింత తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు.

కొనగట్టుపల్లిని సందర్శించిన తమిళనాడు బృందం



రాష్ట్రపతి నుంచి అందుకున్న అవార్డుతో సర్పంచ్, జిల్లా పంచాయతీ అధికారి, తమిళనాడు బృందం సభ్యులు

హన్వాడ: జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు పొందిన కొనగట్టుపల్లి దేశంలోని మరిన్ని పల్లెలకు ఆదర్శంగా నిలుస్తోందని తమిళనాడు బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. బుధవారం తమిళనాడు పంచాయతీరాజ్ శిక్షణలో భాగంగా ఈరోడ్, సేలం జిల్లాలకు చెందిన బ్లాక్ సమితి అధ్యక్షులు, సర్పంచ్‌లు గ్రామాన్ని సందర్శించారు. ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. సర్పంచ్ మానస, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి అభివృద్ధికి చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. వారి వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, డీఎల్‌పీఓ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, ఎంపీపీ బాలరాజు, ఎంపీటీసీ సభ్యుడు చెన్నయ్య, వార్డు సభ్యులు ఉన్నారు.

మంత్రులను కలిసిన జోగులాంబ పాలక మండలి



దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖకు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు, పాలకమండలి సభ్యులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి సహకారం అందించాలని బుధవారం ఆలయ పాలక మండలి సభ్యులు పలువురు మంత్రులు, అధికారులను హైదరాబాద్‌లో కలిశారు. ముందుగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కలిసి అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదం అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. అలాగే ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఫిబ్రవరి 14న వసంత పంచమి రోజున జోగుళాంబ అమ్మవారి నిజరూప దర్శనానికి రావాలని ఆహ్వానించారు. అనంతరం సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, పర్యాటక, సాంస్కృతిక, క్రీడలు, యువజన అభ్యుదయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ అయ్యర్‌ను కలిశారు. వెళ్లిన వారిలో చైర్మన్ చిన్న కృష్ణయ్య, ఈఓ పురేందర్, పాలక మండలి సభ్యులు వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటనారాయణ, వెంకటేష్, సత్యనారాయణ, అంపయ్య, అడవప్ప, రమేష్‌బాబు, ధనుంజయ, కేశన్న, సత్యన్న, ఆలయ ముఖ్య అర్చకులు ఆనంద్‌శర్మ, విక్రాంత్‌శర్మ ఉన్నారు.